# ప్రాథమిక విద్య- రాశి పెరిగినా వాసి మిథ్య

జయప్రకాష్ నారాయణ్

Bhavishyat Bharatam, January 30, 2006

వార్షిక విద్యాస్థాయి నివేదిక (ఎ.ఎస్.ఇ.ఆర్)-2005ను క్రోడీకరించి, విడుదల చేయడం- భారతదేశంలో పాఠశాల విద్య పరిణామ క్రమంలో మైలురాయి. దేశవ్యాప్తంగా 485 గ్రామీణ జిల్లాల్లో బడికి వెళ్లే బాలలపై ప్రముఖ సామాజిక సంస్థ 'ప్రథం' సర్వే జరిపింది. దాదాపు 10,000 మంది స్వచ్ఛంద సేవకులతో పాటు 776 చిన్నా పెద్దా బృందాలు ఈ బృహత్ కార్యక్రమంలో పాలుపంచుకొన్నాయి. స్థూలంగా ప్రాథమిక విద్య ఫలితాలను ఈ సందర్భంగా అంచనావేశారు. 9521 గ్రామాల్లో దాదాపు నాలుగు లక్షల మంది బడి పిల్లలకు సంబంధించి వివరాలు పొందుపరచి పరిస్థితిని మదింపు చేశారు.

కేవలం మూడు నెలల కాలంలోనే తక్కువ ఖర్చు, ఉన్నత ప్రమాణాలతో ఈ బృహత్కార్యాన్ని సాధించారు. అన్నీ ప్రభుత్వమే చేయాలని ఎల్లకాలం ఎదురుచూస్తూ కూర్చోబోమని రుజువు చేశారు. సర్వేలో పెద్ద సంఖ్యలో పౌరులు కూడా పాల్గొన్నారు. ఈ సర్వే గొప్పగా విజయవంతమైందనేందుకు ఇదే నిదర్శనం. విద్య, ఆరోగ్య రంగాల్లో పురోగతి కోసం యావత్ సమాజాన్ని కూడగట్టడానికి నిరంతరం ఇదే దారిని అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రాథమిక విద్యకు సంబంధించి మనకు తెలియని కొత్త కోణాలెన్నింటినో ఎ.ఎస్.ఇ.ఆర్. ఆవిష్కరించింది. అందులో ఉన్నదంతా 6 - 14 ఏళ్లలోపు బడిపిల్లలకు సంబంధించిన సమాచారమే అయినప్పటికీ, ప్రాథమిక స్థాయిలో పునాది ఎలా ఉందన్నదాన్ని బట్టి మాధ్యమిక స్థాయిలో విద్యావ్యవస్థ స్థితిగతులను అవగాహన చేసుకోవడానికి అది దోహదపడుతుంది. పాఠశాలల్లో, ఫలితాలను బట్టి ఉపాధ్యాయుల ప్రమాణాలను, అంకితభావాన్ని, జవాబుదారీతనాన్ని అంచనా వేయడానికి వీలు కలగడం అంతకన్నా ముఖ్యాంశం.

## అంకెల్లో నిజాలు

ఎ.ఎస్.ఇ.ఆర్-2005 ఫలితాలు మిశ్రమంగా వచ్చాయి. దీని ప్రకారం- ప్రాథమిక విద్యకు కేటాయింపులు పెంచడమే కాకుండా, సర్వశిక్షా అభియాన్, మధ్యాహ్న భోజన పథకం వంటి వాటి ద్వారా దీనికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. దాంతో పాఠశాలల్లో నమోదు పెరిగింది. బడి మానేయకుండా చదువు కొనసాగించే వారి సంఖ్యా పెరిగింది. 6 - 14 ఏళ్లలోపు పిల్లల్లో 93.4 శాతం మంది పాఠశాలలకు వెళ్తున్నారు. అయితే ఈ విషయంలో వివిధ రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. గోవా (99.7 శాతం), కేరళ (98.4 శాతం), కర్ణాటక (98.1 శాతం), ఉత్తరాంచల్ (98 శాతం), తమిళనాడు (97.3 శాతం), మహారాష్ట్ర (97.2 శాతం) ముందంజ వేయగా, బీహార్ (86.5 శాతం), రాజస్థాన్ (89.6 శాతం), జార్ఖండ్ (90.2 శాతం), ఒరిస్సా (91.1 శాతం), ఆంధ్రప్రదేశ్ (92.6 శాతం), ఉత్తరప్రదేశ్ (92.7) కొంత వెనకబడ్డాయి. ఈ రాష్ట్రాలూ దూసుకెళ్లాల్సిన అవసరం ఉంది. మొత్తం మీద పరిస్థితి మెరుగుపడింది. 75.1 శాతం పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనూ, 16.4 శాతం పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లోనూ చదువుకొంటున్నారు. దాదాపు మూడు శాతం పిల్లలు మదర్సాల్లోను, ప్రత్యామ్నాయ పాఠశాలల్లోనూ చదువుకొంటుండగా 6.6 శాతం మంది, అంటే కోటీ 10 లక్షల మంది పిల్లలు బడికి వెళ్లడం లేదు. వారిలో సగానికి పైగా పిల్లల పేర్లు ఇప్పటిదాకా పాఠశాలల్లో నమోదు కాలేదు.

మరోవైపు, పాఠశాలల్లో పిల్లల చదువు సాగుతున్న తీరూ-తెన్నూ చూస్తే కడుపు తరుక్కుపోతుంది. 7 - 14

ఏళ్ల లోపు బడిపిల్లల్లో 34.9 శాతం మంది ఎంతో సరళమైన చిన్న పేరాగ్రాఫ్ కూడా చదువలేరు. 51.9 శాతం మంది మామూలు కథను కూడా చదవలేరు. 11 - 14 ఏళ్లలోపు పిల్లల్లో 31 శాతం మంది పరిస్థితీ ఇంతే. ఈ విషయంలో ప్రభుత్వ పాఠశాలల కన్నా ప్రైవేట్ పాఠశాలలు కొంతమెరుగు. ఒక పాఠ్యాంశాన్ని తీసుకొన్నపుడు దాన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల్లో 65 శాతం మంది చదవలేకపోగా, ప్రైవేట్ పాఠశాల ల్లోని 52 శాతం పిల్లలు చదవలేరని స్పష్టమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ బడుల మధ్య తేడా పెద్దగా లేదని దీన్ని బట్టి అర్థమవుతోంది.

అంక గణితంలోను బడిపిల్లలు బాగా వెనకబడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. 7 - 14 ఏళ్లలోపు పిల్లల్లో 41 శాతం మందికి పైగా రెండంకెల తీసివేత లెక్క చేయలేరు. 65 శాతం మందికి పైగా పిల్లలు మూడంకెలను భాగించలేరు. 6, 7 తరగతులు చదువుతున్న పిల్లల్లో- ప్రభుత్వ పాఠశాలల్లోని వారిలో 40 శాతం, ప్రైవేట్ పాఠశాలల్లోని వారిలో 33 శాతం సామాన్య భాగహారం కూడా చేయలేరు. విశిష్ట సాంకేతిక పరిజ్ఞానం, గణిత ప్రావీణ్యం, ప్రపంచానికంతటికీ బ్యాక్ ఆఫీస్ సేవలు అందచేయగలిగే సామర్థ్యం కలిగి ఉన్నందుకు ఎంతో గర్విస్తున్న మనదేశంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడటం తీవ్రంగా కలవరం కలిగించేదే. జన్యుపరమైన సమర్థత, విద్యావంతులైన తల్లిదండ్రులు, మంచి పాలన- పోషణ, సమర్థులైన ఉపాధ్యాయులను కలిగి ఉన్న పిల్లలు చదువుల్లో బాగా రాణించడమే కాకుండా మంచి ఉద్యోగాలు కూడా పొందగలుగుతున్నారు. వారిలో కొందరు ఆయా రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ స్థాయికి ఎదిగి, మనదేశం గర్వపడేలా చేయగలుగుతున్నారు. ఇక్కడ విద్యాబుద్ధులు నేర్చుకున్న వారు ప్రపంచస్థాయికి ఎదగగలుగుతున్నప్పటికీ, అలాంటి వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. దాదాపు 80 శాతం ప్రతిభా సామర్థ్యాలను వెలికితీయలేకపోతున్నాం. ప్రజానీ కంలో ఎన్నో శక్తియుక్తులున్నప్పటికీ అవన్నీ వృథా అయిపోతున్నాయి. పాఠశాల, కళాశాల విద్యావ్యవస్థ కొన్నే ళ్లుగా ముందుకు సాగుతున్నా- స్వల్ప ఉత్పాదకత, నైపుణ్యం లేకపోవడం, తీవ్రస్థాయి నిరుద్యోగం వంటి సమ స్యలు మనల్ని పట్టిపీడిస్తున్నాయి.

మనకు ఉన్న కొన్ని భ్రమల్ని ఎ.ఎస్.ఇ.ఆర్-2005 తొలగించింది. బాగా చదవగలిగిన బడి పిల్లలు ఉన్న రాష్ట్రాల్లో బీహార్ ఒకటి అని, తమిళనాడు, గుజరాత్, కర్ణాటకల్లోని బడి పిల్లల్లో దాదాపు సగం మందికి సర ళమైన పాఠ్యాంశాలు కూడా చదవరాదని వెల్లడైంది. కర్ణాటక, తమిళనాడులోని ఐదో స్టాండర్డ్ పిల్లల్లో దాదాపు 70 శాతం మందికి చిన్న భాగహారం కూడా చేయరాదని తేలింది. ఆంధ్రప్రదేశ్‌లో బడికి వెళ్లని పిల్లల సంఖ్య, బాల కార్మికుల సంఖ్య అధికంగాను, విద్యా ప్రమాణాలు తక్కువ స్థాయిలోను ఉన్నాయి. రాష్ట్రం ఒక వైపు ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజ వేస్తుంటే, మరోవైపు ఈ విధంగా తిరోగమిస్తోంది. బడికి వెళ్తున్నవారు, బడి మానేస్తున్నవారు, వారిని ప్రభావితం చేస్తున్న అంశాలు... తదితర విషయాలను జాగ్రత్తగా పరిశీలించాలి. ఎంతో భారీయెత్తున సర్వే జరిపి గణాంకాలు సేకరించారు. కనుక... అంకెలు అబద్ధాలు చెప్పవని గమనించాలి.

పరిస్థితిని చూసి పూర్తిగా నిరాశా నిస్పృహలకు లోను కావలసిన అవసరం లేదు. అక్కడక్కడ ఆశారేఖలూ కనిపిస్తున్నాయి. విద్యాభ్యాసానికి మన సమాజం ఎంతో విలువ ఇస్తుంది. తమ పిల్లలు బాగా చదువుకోవడం కోసం ఎంత మూల్యమైనా చెల్లించడానికి తల్లిదండ్రులు సిద్ధపడుతున్నారు. విద్యారంగంలో సత్ఫలితాలు ఎలా సాధించాలన్నదే ఇప్పుడు చర్చనీయాంశమని ఎ.ఎస్.ఇ.ఆర్. సర్వే తెలిపింది. కొన్ని గట్టి చర్యలు తీసుకొంటే పాఠశాల విద్యావ్యవస్థ గణనీయంగా మెరుగుపడుతుంది. విద్యావ్యవస్థ మెరుగుదలను ఎప్పటికప్పుడు పర్యవే క్షించి, అమూల్యమైన వివరాలు సమకూర్చేందుకు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో టెస్టింగ్ బోర్డులను ఏర్పాటు

చేయడం మొట్టమొదట చేయాల్సిన పని. ఏ అంశాన్ని, ఏ రకంగా పరీక్షించాలన్నది విద్యావ్యవస్థలో కీలకం. ఇందుకు సంబంధించి ప్రపంచం వివిధ ప్రాంతాల్లో అమల్లోఉన్న విధానాలను ఈ బోర్డులు మన పరిస్థితులకు అనువుగా మలచుకొని అనుసరించాలి. అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, స్కాట్లాండ్, జపాన్ తదితర దేశాల్లో అమల్లో ఉన్న ప్రామాణిక మదింపు విధానాలు అత్యుత్తమమైనవి, ఆదర్శ నీయమైనవి. మన ఎస్.సి.ఇ.ఆర్.లు ఇప్పటికే జాతీయ పాఠ్యాంశ ప్రణాళికకు, అభ్యసనకు సంబంధించి కనీస స్థాయులను అభివృద్ధి పరచింది. దేశమంతటికీ వర్తించేవిధంగా అర్థవంతమైన ప్రామాణిక మదింపు ప్రక్రియను రూపొందించడానికి ఈ రెండింటినీ ప్రాతిపదికగా తీసుకోవచ్చు.

### సదవకాశం

ప్రస్తుత పరీక్ష పద్ధతి తప్పుల తడకగా తయారైంది. ఉత్తీర్ణత శాతాన్ని పెంచవలసిందిగా ఉపాధ్యాయులపై ఒత్తిడి వస్తోంది. పరీక్షల్లో పెద్దయెత్తున కాపీయింగ్‌కు అది దారి తీస్తోంది. పదోతరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని ఆరు నెలల్లోనే 26 శాతం నుంచి 94 శాతానికి పెంచినందుకు తన మంత్రిని ఒక ముఖ్యమంత్రి ఆకాశానికి ఎత్తిన సంగతి నాకు గుర్తుంది. తీవ్ర ఒత్తిళ్ల కారణంగా ఉపాధ్యాయులు తప్పుదోవ తొక్కారనేందుకే ఈ అంకెలు తార్కాణాలు. అంతే తప్ప అవి సత్ఫలితాలు ఎంత మాత్రం కావు. టెస్టింగ్ బోర్డులు మొదట శాంప్లింగ్ టెస్టులను పరిశీలించి మన విద్యావ్యవస్థలోని బలహీనతలను గుర్తించాలి. పరిస్థితిని మెరుగుపర్చడా నికి వ్యూహాత్మక చర్యలు చేపట్టాలి. తక్కువ ఖర్చుతో తీసుకొనే ఇలాంటి చర్యల వల్ల విద్యావ్యవస్థ గాడిలోపడి, సత్ఫలితాలు వస్తాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, సమాజం నుంచి కూడా సరైన స్పందన వస్తుంది. విద్యావ్య వస్థను పరిపుష్టం చేయడానికి పాఠశాల బోర్డులను ఏర్పాటుచేయడం, విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ల కోసం జాతీయస్థాయి విద్యాప్రమాణాలపై పరీక్షలు నిర్వహించడం వంటి చర్యలను తదుపరి తీసుకోవాలి. పాఠశాల విద్యావ్యవస్థ మెరుగుదలకు అమూల్యమైన ఉపకరణాన్ని ఎ.ఎస్.ఇ.ఆర్-2005 అందచేసింది. ఉత్పాదకత పెంచడానికి, పేద పిల్లలకు సదవకాశం కల్పించడానికి ఇంతకు మించి కావలసింది ఇంకేమైనా ఉంటుందా? ప్రభుత్వం ఇప్పటికైనా కార్యాచరణకు పూనుకొంటుందా?

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)